ఆవేశంతో వెంటనే అడిగేయాలనిపించింది.

జయశ్రీ మొదలుకొని కన్యవరకు జరిపిన రహస్య ప్రణయకాండ గురించి దులిపేయాలనిపించింది.

అయినా ముందుకు కదలలేక పోయింది.

ఇదంతా నాకెందుకు అన్న నిర్లిప్తత.

సగటు ఆడదానిలా ప్రవర్తించ కూడదన్న అహంకారం.

సమయం వచ్చినప్పుడు దానంతట అదే తెలియక పోదన్న నమ్మకంతో మిన్నకుండి పోయింది.

ఆదివారం ఫంక్షనుకు మరేం రాద్ధాంతం చేయకుండానే కిరీటితో కళామందిర్‌కు వెళ్ళింది.

ఆడిటోరియం అంతా క్రిక్కిరిసిపోయి వుంది.

ఏదో నాటకం ..... మోనోయాక్షన్..... మరేదో జరిగింది.

దేనిపైనా శిల్ప మనసు లగ్నం కావటంలేదు.

సాంస్కృతిక కార్యక్రమం ముగియగానే ఫైనాన్స్‌వింగ్ సెక్రట్రీ కిరీటిని, శిల్పను వినయంగా స్టేజ్‌పైకి ఆహ్వానించారు.

హాలు కరతాళ ధ్వనులతో ప్రతిధ్వనించింది.

మెడలో అలంకరించిన పూలదండల్ని ప్రక్కనబెట్టి కిరీటి సరసన ఠీవిగా కూర్చుందామె.

అక్కడ వున్న వారంతా తనకో ప్రత్యేక గౌరవాన్నిచ్చి వింతగా, అబ్బురంగా చూస్తుంటే చాలా గర్వమనిపించి కొంత ఊరట చెందింది.

స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యకలాపాలకు సంబంధించిన బహుమతులు శిల్ప చేతిమీదుగా అందచేయబడ్డాయి.

"ఏడాది పొడుగునా శ్రమించి పనిచేసే మా ఉద్యోగుల శ్రమను మరపింప చేసే ఇలాంటి ఉత్సవాలకు వెన్నుతట్టి ప్రోత్సహించే మంచిమనిషి మా కిరీటి బాబు... మాలినీ యంత్ర కర్మాగారంలో పని చేసే మమ్మల్ని యంత్రాల్లాగాక మనుష్యులుగా గౌరవించే యజమాని మా బాబు.... మాకష్టాలను, సమస్యలను అనుక్షణం గుర్తిస్తూ సామరస్యంతో వ్యవహరించే ఇటువంటి యజమాని మాకుండుట మా అదృష్ట"మంటూ స్తుతించాడు కార్మిక నాయకుడైన సదానందం.

తర్వాత కిరీటి తన ఉపన్యాసానికి ఉపక్రమిస్తూ "నన్ను నమ్ముకున్న వాళ్ళకు అసరాగా నిలబడటం నా అభిమతం... అదే అభిప్రాయంతో హార్ట్‌వాల్స్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు సిద్ధపడే ఆర్థిక శక్తి లేక తన కొడుకును ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చేర్పించి అసహాయుడుగా నిలబడిపోయిన డ్రైవరు థామస్‌కు రాయవెల్లూరు ట్రీట్‌మెంట్‌కు అవసరమయ్యే పదివేల రూపాయల్ని యీ సభాముఖంగా అందచేస్తున్నాను....." అంటూ థామస్‌ను వేదికపైకి పిలిచేసరికి సభ హర్షధ్వానాలతో మార్మోగిపోయింది.

ఆవేశంగా వేదికపైకి వచ్చి అశ్రువులతో పాదాలను అభిషేకిస్తున్న థామస్‌ను లేవనెత్తి నోట్లకట్టను అందచేశాడు.

ఆ సన్నివేశం చూసిన అందరి కళ్ళు చెమ్మగిల్లాయి.

"పేద తనమన్నది ఎంత భయంకరమైనదో నాకు తెలుసు కాబట్టే స్వర్గీయ చక్రవర్తిగారి పేర్న ఓ ట్రస్ట్ స్థాపించి ఇలాంటి అవసరాలకు అయ్యే ఖర్చుల్ని నేనే భరించాలనుకుంటున్నాను..."

మళ్ళీ చప్పట్లు...

"డబ్బును సంపాదించటం మాత్రం పరమార్థంగా పెట్టుకోక ఆడబ్బుకో ఆరాన్ని, అవిధంగా నా లక్షా ్యలకో రూపాన్ని ఇవ్వడమే నా ఆశయం... అనాధలందర్ని ఆదుకునే శక్తి లేకపోయినా ఏ కొందరికైనా కొంత సహకారాన్ని అందించగలగితే నా జీవితం ధన్య మైనట్టే...."

విస్ఫారిత నేత్రాలతో కిరీటినే చూస్తూ వుండిపోయింది శిల్ప.

"ఈ విధంగా నేనేదో గొప్పవాడిలా చెలామణి కావాలన్న దుగ్ధ నాకులేదు. ఈ కిరీటి కొందరికైనా ఉపయోగపడితే చాలన్న ఆకాంక్ష మాత్రమే."

కారు నడుపుతూ సంజాయిషీ ఇస్తున్నట్టుగా కిరీటి ఆ మాటలెందుకన్నదీ ఆమెకు అర్థంకాలేదు.

అయినా అందరిచేత కొనియాడబడే కిరీటి తనతో అలా మాట్లాడటం ఆ క్షణంలో ఆమె కెంతో హాయినిచ్చినట్టుగా అనిపించింది.

చక్రవర్తి ఎవరు?

అసలు కన్యకీ కిరీటికీ ఉన్న సంబంధం ఏమిటి?

కిరీటి గతంలో ఆస్తికి, పేరు ప్రఖ్యాతులకు వారసుడైన తననెందుకు కోరుకున్నట్టు..?

ఆరోజు తన అహంకారం పూర్తిగా తగ్గాక తనెవరన్నదీ వివరిస్తానన్నాడే...

అంటే కిరీటి పూర్వాశ్రమంలో తనకు పరచయస్తుడన్న మాటేగా...

అదే నిజమైతే తనెందుకు గుర్తుపట్టలేక పోతోంది?

ఇలా సందేహాల మధ్య నలిగి పోయేకంటే అతని ద్వారానే అనుమానాలను నివృత్తి చేసుకుంటే...

అసలు అతడి వ్య క్తిగత విషయాలు అడిగేటంత చేరువ కాగలిగిందా తను....

అహంకారంతో అనుక్షణం అతడ్ని అవమానించటమే పనిగా పెట్టుకున్న తనకు అడిగితే మాత్రం చిక్కుముడిని విప్పుతాడన్న గ్యారంటీ ఏమిటి?

పెద్ద చాలెంజ్ చేసినట్టుగా సమయం వచ్చినప్పుడు తనెవరన్నదీ వివరిస్తానన్న పెద్దమనిషి అంత తేలిగ్గా తనతో సహకరిస్తాడా...?

ఇంకా ఏం చేస్తే కిరీటి గురించి తను తెలుసుకోగలుగుతుంది

ఆలోచనలతో బెడ్‌పై అటూ ఇటూ పొర్లుతూ అర్ధరాత్రి వరకూ గడిపింది.

పోనీ. అతడు కోరినట్టు ప్రేమను పంచి..

అసంభవం... తనలా చేయలేదు... అతని ముందు తను తల వంచలేదు....

కనీసం ప్రేమిస్తున్నట్టు నటిస్తే...

అవును.... అలా చేయాలి.... అలా చేస్తేగానీ కిరీటి ఎవరన్నదీ తనకు తెలియదు.... ఏరికోరి తనను వివాహం చేసుకోవటంలో గల అంతరార్థం స్పష్టంకాదు.

ఓ దృఢనిశ్చయానికి వచ్చినట్టుగా హాయిగా నిద్రపోయింది.

తెల్లవారుజామునే లేచి కాలకృత్యాలు ముగించుకుని తన ఆలోచనలకు రూపమిచ్చే ప్రయత్నంగా అతని కోసం నిరీక్షిస్తూ డైనింగ్ హాల్లో కూర్చుంది.

“అయ్యగార్ని జయశ్రీ అమ్మగారు తీసుకెళ్ళారండి... గజేంద్రబాబుగారికి గుండెనొప్పివస్తే ఆసుపత్రిలో చేర్పించారట.”

అడక్కుండానే చెప్పింది వంటమనిషి.

అసూయతో ఆమె గుండెలు మండిపోయాయి.

ఫోన్ చేసి పిలవ్వచ్చుగా.... మొగుడ్ని ఆసుపత్రిలో వదిలి అంత ఉదయాన్నే ఇక్కడకు రావాలా...

కోపంగా జయశ్రీ ఇంటికి ఫోన్ చేసింది.

జయశ్రీ ఫోనెత్తినట్టు గుర్తించగానే “మావారున్నారా?” అంటూ సీరియస్‌గా అడిగింది.

“వచ్చి గంట కూడా కాలేదు..... అప్పుడే అంత విరహమా.”

జోవియల్‌గా అందో, జలసీగా అందో శిల్పకు అర్థం కాలేదు.

“ముందాయనకో మారు ఫోన్ ఇవ్వండి.” ఆజ్ఞాపిస్తున్నట్టుగా అంది.

“హలో ....” అవతలి నుంచి కిరీటి గొంతు వినిపించింది.

“మీరు బ్రేక్ ఫాస్టు చేయకుండానే వెళ్ళారు.”

శిల్ప నోటి నుండి ఇంతటి అనురాగ పూరితమైన మాటలనెప్పుడూ వినని కిరీటి అవాక్కయిపోయాడు---కొన్ని లిప్తల పాటు....

“గజేంద్రకు హార్ట్ ఎటాక్ వచ్చిందని చెబితే....” నెమ్మదిగా అన్నాడు.

“ఆసుపత్రికి వెళ్ళకుండా ఇంటిదగ్గరే ఉండిపోయారేం?”

“ఆయన ఇంటిలోనే వున్నాడు.” ఈ ప్రశ్నల పరంపరకు కారణమేమిటా అని ఆలోచిస్తూ....

“అలా అంటేగాని రానని జయశ్రీ అబద్ధం చెప్పింది.” అన్నాడు మరో ప్రశ్నకు అవకాశమివ్వకుండా.

“నేను ముందే వూహించాను... సాయంత్రం పిక్చరుకి వెళదాం ఎర్లీగా వచ్చేయండి.”

“ఏ పిక్చర్‌కి?“ విభ్రమంగా అడిగాడు.

“[illegible]... అదే భూతాల సినిమా.”

జయశ్రీ పై అక్కసుగా భూతం అని మరింత నొక్కి పలుకుతూ ఫోన్ పెట్టేసింది.

ఏసి ఉన్నా ముఖం చెమటలు పట్టేసింది.

ఇంతసేపు మాట్లాడింది తనేనా అన్న అనుమానం, తన చొరవపై తనకే అపనమ్మకం కలగ్గానే సిగ్గుతో ముడుచుకు పోయింది.

అయిదుగంటలకల్లా వచ్చేశాడు కిరీటి .

బిడియంతో చాలా సేపటి వరకు అతని ముందుకు రాలేక పోయింది.

బెట్టుచేయకుండా ముస్తాబై వచ్చిన శిల్పను చూడగానే ఇది కలయా వైష్ణవ మాయయా అని అబ్బురపడిపోయాడు.

ఇక బయలు దేరుతారనగా వర్షం మొదలైంది. కొన్ని క్షణాలు పాటు  పోర్టికోలో నిలబడి పోయారిద్దరూ.

"అప్పుడే అనుకున్నాను ఇలాంటిదేదో జరుగుతుందని." స్వగతంలా అన్నాడు మేఘావృతమై వున్న ఆకాశం కేసి చూస్తూ.

"ఏమిటి అనుకున్నారు" వర్షాన్ని చూస్తూ అమాయకంగా అడిగింది. అతని మాటల్లోని నిగూఢాన్ని గుర్తించని శిల్ప.

"అదే..... పొద్దుట నీ దగ్గర నుండి పిక్చరు కెళదామని ఫోన్ రాగానే అనుకున్నాను. ఇవాళ తుఫాను వచ్చే అవకాశముందని..."

వచ్చేనవ్వును ఆపుకుని నేలచూపులు చూస్తూ నిలబడింది.

"పోనీలెండి.... మానేద్దాం...."

"ఈ తుఫాను  కాస్త నయం. అలా వచ్చి ఇలా పోతుంది. కారులోనేగా వెళ్ళేది.... రా కూర్చో" సర్కాస్టిక్‌గా అని ఆమెను చూస్తూ కారు డోర్ తెరిచాడు.

మారు మాట్లాడకుండా కారెక్కింది.

మరో పది నిమిషాల్లో కారు శ్రీకన్య ధియేటర్ దగ్గర  ఆగింది.

కారు పార్కు చేయటానికి ముందు శిల్ప తడవకుండా బాల్కనీకి చేరువలో ఆపాడు.

వర్షం చాలా ఉధృతంగా ఉండటంతో జనం అంతగా లేరు.

"శ్రీకన్య"

శిల్ప ధియేటరు పేరును మననం చేసుకుంటూంటే కిరీటి ఆమెవేపు  అర్థం కానట్టుగా చూశాడు....

"శ్రీకన్య అంటే మీకు చాలా ఇష్టమైన పేరనుకుంటాను" అసంకల్పితంగా బయటకు అనేసింది.

ఓ నీలితెర అతని ముఖంలో తారాడి మాయమైంది.

"నీకిష్టమైన సినిమా ఆడేది ఇందులోనే...." ఆమెకు మాట్లాడే అవకాశ మివ్వకుండా బాల్కనీ వేపు అడుగులు వేశాడు.

చాలా భయానకమైన చిత్రం కావటంతో సినిమా చూస్తున్నంతసేపు శిల్ప వణికిపోతూనే వుంది.

ఒకటి రెండు సార్లు గట్టిగా కేకేయబోయి బలవంతంగా నిగ్రహించుకుంది.

సినిమాలో భూతం ఆవహించిన పాప చూపులు ఆమెలోని ధైర్యాన్ని సడలిస్తుంటే చూడలేనట్టుగా కళ్ళు మూసుకుంది కూడా....

మరికొంతసేపు అక్కడ వుంటే గుండె ఆగిపోయేది ఖాయమనిపించటంతో 'వెళ్ళిపోదామండి నాకు భయంగా వుంది' అంటూ కిరీటిని తొందరపెట్టింది.

సినిమా ఏకాగ్రతతో చూస్తున్నా చాలా సేపటినుండి ఆమె పరిస్థితిని కూడా గమనిస్తున్నాడు కిరీటి.

అందుకే 'భయంలేదు- నేనున్నానుగా' అన్నట్టుగా ఆమె చేతిని మృదువుగా నొక్కుతూ చిత్రం పూర్తయ్యే వరకూ ఆమెను కూర్చోబెట్టాడు.

ఇంటికి తిరిగి వచ్చినా సినిమా దృశ్యాలు ఆమెను వెంటాడుతూనే వున్నాయి.

డిన్నరు పూర్తయ్యాక తన గదిలోకి వెళ్ళింది.

బయట వర్షం మళ్ళీ ఎక్కువైంది. ఈసారి దానికి ఈదురు గాలి కూడా తోడవడంతో వాతావరణం కూడా భయానకంగా మారిపోయింది.

ఒంటరిగా గదిలో ఉండటానికి భయం వేసింది.

కిరీటి పిలిస్తే బాగుణ్ణు అన్న ఆలోచనతో అతడు వస్తాడేమోనని చాలా సేపటివరకూ ద్వారంవేపు చూస్తూ గడిపింది.

తనే చొరవ తీసుకుని వెళ్ళాలంటే సిగ్గు అడ్డొచ్చింది.

అలా సందిగ్ధంలోనే మగతగా నిద్రపట్టేసింది.

నిద్రలో పాప రక్తం తాగే చూపులు, గుండెలదిరేటట్టు వేసే కేకలు గుర్తుకువచ్చి ఉలిక్కిపడి పైకిలేచింది.

టైమెంతైందో కూడా చూడటానికి భయం వేసింది.